


నిలకడగా గోదావరి వరద

ప్రజాశక్తి - కుక్కునూరు రూరల్

గత పది రోజులుగా పెరుగుతూ తగ్గుతూ వస్తున్న గోదావరి వరద గత మూడు రోజులుగా నిలకడగా ఉంది. భద్రాచలంలో శుక్రవారం 36 అడుగులు ఉన్న గోదావరి వరద శనివారం కూడా అదేవిధంగా నిలకడగా ఉంది. ఓవైపు గోదావరి వరద ఏమాత్రం తగ్గకుండా నిలకడగా ఉండటం మరో వైపు ముంపు మండలాల్లోని మిర్చి సాగు చేసే రైతులు అదును దాటుతుండటంతో ఈ ఏడాది మిర్చి పంట సాగు విరమించుకునేలా ఉన్నారు. ధైర్యం చేసి అత్యంత పెట్టుబడితో కూడిన మిర్చి పంటను సాగు చేసినా మళ్లీ గోదావరి పెరిగి పంటను ముంచెత్తితే తీవ్ర నష్టాల ఊబిలో కూరుకు పోవాల్సిన పరిస్థితి ఏర్పడుతుందని దిక్కుతోచని స్థితిలో ముంపు మండలాల రైతాంగం ఉన్నారు. ఇప్పటికే గత 11 రోజులుగా కుక్కునూరు-దాచారం మధ్య గుండేటి వాగు కాజ్ వే ముంపులోనే ఉండటంతో వాగు అవతల ఉన్న 12 గిరిజన గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి.

మృత్యు దారులు..!

రెండు జిల్లాల్లో అధ్వానంగా రోడ్లు

ఏలూరు జిల్లాలో 1800 కిలోమీటర్ల రోడ్ల వ్యవస్థలో సగానికిపైగా ఛిద్రం

పశ్చిమలోనూ ఇదే పరిస్థితి...

కూటమి ప్రభుత్వం వాగ్దానాలన్నీ కాగితాలకే పరిమితం

జంగారెడ్డిగూడెం-ఏలూరు, బుట్టాయగూడెం రోడ్డు అధ్వానం

భీమవరం నుంచి జక్కరం రోడ్డు పరిస్థితి అంతే..

ఆగ్రహం వ్యక్తం చేస్తున్న జనం

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

'2025 సంక్రాంతి నాటికి రాష్ట్రంలో రోడ్లపై గోతులన్నీ పూడ్చి బాగుచేస్తామని చెప్పిన కూటమి సర్కార్ 2026 సంక్రాంతి దగ్గర పడుతున్నా' ఇప్పటికీ రోడ్ల గురించి పట్టించుకోని పరిస్థితి నెలకొంది. ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల్లో రోడ్ల వ్యవస్థ అత్యంత దారుణంగా తయారైంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకొచ్చి 14 నెలలు గడిచినా రోడ్ల వ్యవస్థ ఏ మాత్రమూ బాగుపడలేదు. జనం పడుతున్న ఇబ్బందులు వర్ణాతీతంగా మారాయి. వర్షాలకు రోడ్లన్నీ చెరువులుగా మారిపోతున్నాయి. ఆ గోతుల్లో పడి జనాలు ప్రమాదాల బారిన పడుతున్నారు. దీంతో రోడ్లన్నీ మృత్యుదారులుగా మారాయంటూ జనాల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారింది. గత వైసిపి ప్రభుత్వం రోడ్ల గురించి పట్టించుకోకపోవడంతో జనాల్లో తీవ్ర ఆగ్రహం వెల్లువెత్తడంతో 2024 ఎన్నికల్లో రెండు జిల్లాల్లో ఒక్క అసెంబ్లీ, పార్లమెంట్ స్థానం కూడా రాకుండాపోయింది. కూటమి ప్రభుత్వం సైతం రోడ్ల గురించి పట్టించుకోకపోవడంతో ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో దాదాపు మూడు వేల కిలోమీటర్ల వరకూ ఆర్అండ్‌బి రోడ్లు ఉన్నాయి. విభజిత ఏలూరు జిల్లాలో 1800 కిలోమీటర్ల ఆర్అండ్‌బి రహదారుల వ్యవస్థ ఉంది. ఏ నియోజకవర్గంలో చూసినా రోడ్ల వ్యవస్థ అత్యంత దారుణంగా తయారైంది. డిఆర్‌సి, జిల్లా పరిషత్ సమావేశాల్లో ఎంఎల్‌ఎలు, స్థానిక ప్రజా ప్రతినిధులు రోడ్ల సమస్యపై లేవనెత్తుతున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. ఏజెన్సీ ప్రాంతం జంగారెడ్డిగూడెం నుంచి బుట్టాయగూడెం వెళ్లే రోడ్డు అత్యంత దారుణంగా మారింది. ఆ రోడ్డుపై వెళ్లాలంటేనే భయపడే పరిస్థితి నెలకొంది. ఏలూరు నుంచి జంగారెడ్డిగూడెం వచ్చే రోడ్డు గురించి ఎంత చెప్పినా తక్కువే. వాహనాలు గోతుల్లో పడి నిత్యం ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. చింతలపూడి నుంచి టి.నరసాపురం వెళ్లే రోడ్డు అత్యంత ఘోరంగా మారింది. ఏలూరు నుంచి వంగాయగూడెం రోడ్డు పరిస్థితి అత్యంత ప్రమాదకరంగా తయారైంది. ఉంగుటూరు నియోజకవర్గంలోని మండల కేంద్రం నిడమర్రు నుంచి అడవికొలను వెళ్లే రోడ్డుపై వెళ్లలేని పరిస్థితి ఏర్పడింది. జీలుగుమిల్లి నుంచి టి.నరసాపురం వెళ్లే రోడ్డు సైతం అధ్వానంగా ఉంది. ఆ రోడ్డు ఈ రోడ్డు అని తేడా లేదు. రోడ్లన్నీ అత్యంత దారుణంగా మారాయి. ఏలూరు జిల్లాలో 1800 కిలోమీటర్ల మేర రోడ్ల వ్యవస్థ ఉంటే సగానికిపైగా ఛిద్రమయ్యాయి. పశ్చిమగోదావరి జిల్లాలో భీమవరం నుంచి జక్కరం వెళ్లే రోడ్డు గోతులమయంగా మారింది. నరసాపురం మండలంలో పాత నవరసపురం, మేడపాడు వెళ్లే రోడ్డు, మొగల్తూరు, వెంప వెళ్లే రోడ్డు సైతం అధ్వానంగా తయారయ్యాయి. ఆటోలు, బైక్‌లు సైతం వెళ్లలేని పరిస్థితుల్లో రోడ్లు ఉన్నాయి. ప్రభుత్వం చెబుతున్న మాటలకూ క్షేత్రస్థాయిలో పరిస్థితులకు ఏమాత్రమూ సంబంధం లేకుండా పోయింది. అదిగో.. ఇదిగో నిధులు వచ్చేస్తాయంటూ చెప్పడం తప్ప చిల్లిగవ్వ విడుదల చేయని పరిస్థితి.



దారుణంగా తయారైన బుట్టాయగూడెం రోడ్డు

ఏలూరు జిల్లాలోనే రూ. 200 కోట్లు అవసరం

ఒక్క ఏలూరు జిల్లాలో రోడ్ల వ్యవస్థ బాగు చేయాలంటేనే దాదాపు రూ.200 కోట్లు అవసరమని అధికారులు తేల్చారు. పశ్చిమగోదావరి జిల్లాలోనే అదేస్థాయిలో నిధులు అవసరం ఉంది. నిధులు విడుదల చేయకపోవడంతో రోడ్ల పనులు ముందుకు సాగడం లేదు. వైసిపి ప్రభుత్వం రోడ్ల వ్యవస్థను ఏవిధంగా నిర్లక్ష్యం చేసిందో... కూటమి ప్రభుత్వం కూడా అదేవిధంగా ముందుకు సాగుతోంది. ఇప్పుడు కొత్తగా వచ్చే అక్టోబర్ నాటికి రోడ్లపై గోతులు కనిపించకుండా చేస్తామంటూ ప్రకటనలు గుప్పించారు. దీంతో సంక్రాంతికి రోడ్లపై గుంతలు లేకుండా చేస్తామంటూ చెప్పిన విషయం ఏం చేశారంటూ సోషల్ మీడియాలో విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అభివృద్ధి పేరుతో ఊదరగొట్టడం మినహా రోడ్లు, మౌలిక సదుపాయాల కల్పన ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. కర్నాటక రాష్ట్రం బెంగుళూరులో రహదారులు అధ్వానంగా తయారై ఎదుర్కొంటున్న ఇబ్బందులతో ఒక కార్పొరేట్ కంపెనీ రాష్ట్రం నుంచి వెళ్లిపోతామంటూ ప్రకటించింది. ఎపిలోనూ ఆ పరిస్థితి ఏర్పడనుందనడంలో ఎటువంటి సందేహమూ లేదు. ఇప్పటికైనా ప్రభుత్వం రోడ్ల వ్యవస్థను బాగుచేయాలని రెండు జిల్లాల ప్రజలు కోరుతున్నారు.

కిసాన్ డ్రోన్లను రైతులు ఉపయోగించుకోవాలి

జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి

ప్రజాశక్తి - లింగపాలెం (చింతలపూడి)

కిసాన్ డ్రోన్లను రైతులు విరివిగా ఉపయోగించుకోవాలని జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి తెలిపారు. మండలంలోని లింగపాలెం - కళ్యాణంపాలెం వరి పొలాలకు శనివారం డ్రోన్ ద్వారా నానో యూరియా (స్ప్రే) చేస్తున్న కార్యక్రమాన్ని స్థానిక రైతులతో కలిసి జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వ్యవసాయాన్ని సులభతరం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం రైతులకు అధునాతన వ్యవసాయ పరికరాలు సబ్సిడీతో ఇస్తోందన్నారు. ప్రతి రైతూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వ్యవసాయ రంగంలో సాంకేతిక విప్లవం డ్రోన్ ద్వారా ఎరువులు, పురుగు మందులు ఎకరం పొలానికి పిచికారీ కేవలం 5 నిమిషాల్లోనే పూర్తవుతుందన్నారు. దీంతో రైతులకు సమయం, డబ్బు ఆదా అవుతాయన్నారు. రైతులకు వరంగా మారిన కిసాన్ డ్రోన్లను రైతులు విరివిగా ఉపయోగించుకోవాలని అన్నారు. యూరియా ద్రావణం, సూక్ష్మ పోషకాలు వంటి ద్రావణ ఎరువులను పిచికారీ చేయడం వల్ల సమర్థత పెరిగి, ఎరువులు ఖర్చు తగ్గి రైతులకు డబ్బు, సమయం ఆదా అవుతుందన్నారు. వ్యవసాయానికి డ్రోన్లు చాలా ఉపయోగకరమని, పర్యావరణంపై రసాయన ప్రభావం తగ్గుతుందని తెలిపారు. కొండ ప్రాంతాలు, బురద ప్రాంతాలు, నీరు నిలిచిన పొలాల్లో సులభతరంగా పిచికారీ అవుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సబ్ కలెక్టర్ బొల్లిపల్లి వినూత్న, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి షేక్ హబీబ్ భాషా, జిల్లా పంచాయతీ అధికారి కె.అనురాధ, డిఎల్‌డిఒ పి.వెంకటలత్నం, తహశీల్దార్ ఎండి.నజీముల్లాషా, ఎంపిడిఒ కె.వాణి పాల్గొన్నారు.





మహాసభలో మాట్లాడుతున్న యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు కె.పోచమ్మ

ఆశాలకు వేతనంతో కూడిన సెలవులు ఇవ్వాలి

ఆశాల యూనియన్ జిల్లా ఐదవ మహాసభలో రాష్ట్ర అధ్యక్షురాలు కె.పోచమ్మ

ప్రజాశక్తి - భీమడోలు

ఆశా వర్కర్లకు వేతనంతో కూడిన సెలవులు మంజూరు చేయాలని ఆశా వర్కర్స్ యూనియన్ (సిఐటియు) రాష్ట్ర అధ్యక్షురాలు కె.పోచమ్మ డిమాండ్ చేశారు. కనీస వేతనాలు రూ.26,000లకు పెంచాలని, ఏలూరు జిల్లాలో ఖాళీగా ఉన్న ఆశా వర్కర్ల పోస్టులు వెంటనే భర్తీ చేయాలని ఆమె డిమాండ్ చేశారు. శనివారం భీమడోలులోని రొట్టెల ముసలయ్య కళ్యాణ మండపంలో ఆశా యూనియన్ ఏలూరు జిల్లా ఐదవ మహాసభ ఘనంగా ప్రారంభమైంది. తొలుత మహాసభ ప్రారంభ సూచికంగా సిఐటియు జెండాను సీనియర్ ఆశా కార్యకర్త షేక్ షకీలా ఎగరవేశారు. అనంతరం జరిగిన సభకు జిల్లా అధ్యక్షురాలు కె.కమల ధనలక్ష్మి కామేశ్వరి అధ్యక్ష వర్గంగా వ్యవహరించారు. ఈ సభలో రాష్ట్ర అధ్యక్షురాలు కె.పోచమ్మ మాట్లాడుతూ ఆశాలతో సంబంధం లేని పనులు చేస్తూ పనిభారం పెంచుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సిఐటియు జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ఆర్.లింగరాజు, డిఎన్‌విడి.ప్రసాద్ మాట్లాడుతూ క్షేత్రస్థాయిలో ప్రజా ఆరోగ్య కోసం పనిచేస్తున్న ఆశా వర్కర్ల కష్టానికి తగ్గ ఫలితం ఇవ్వాలని వారు డిమాండ్ చేశారు. జాతీయ ఆరోగ్య మిషన్ పథకానికి నిధులు పెంచాలని, ప్రజారోగ్య వ్యవస్థను బలోపేతం చేయాలని వారు డిమాండ్ చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మిక వ్యతిరేక విధానాలు నిర్వహిస్తే రాబోయే కాలంలో ఐక్య ఉద్యమాలకు సిద్ధం కావాలని వారు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ యూనియన్ జిల్లా ఉపాధ్యక్షురాలు జి.విమల, విఒఎల సంఘం జిల్లా అధ్యక్షురాలు నాగలక్ష్మి, రైతు సంఘం జిల్లా అధ్యక్షులు కట్టా భాస్కరరావు, మండల కన్వీనర్ కె.వెంకటేశ్వరరావు, నాగరాజు వ్యవసాయ కార్మిక సంఘం మండల నాయకులు, ఆశా యూనియన్ జిల్లా కోశాధికారి లోకేశ్వరి, నవ్య, విజయలక్ష్మి పాల్గొన్నారు.

స్వచ్ఛాంధ్రతో వ్యాధులు తగ్గుముఖం

గృహ నిర్మాణ శాఖా మంత్రి కొలుసు పార్థసారధి

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన స్వచ్ఛాంధ్ర కార్యక్రమం ద్వారా రాష్ట్రంలో సీజనల్ వ్యాధులు గతం కంటే తగ్గాయని రాష్ట్ర గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖా మంత్రి కొలుసు పార్థసారధి చెప్పారు. నూజివీడు పట్టణ ఉర్దూ పాఠశాల ప్రాంగణంలో స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా విద్యార్థులచే మొక్కలు నాటించి మంత్రి ప్రతిజ్ఞ చేయించి మాట్లాడారు. వ్యాధులకు మూలం అపరిశుభ్ర వాతావరణమన్నారు. ప్రజలంతా వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత పాటించాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఏటా 25 వేల కోట్ల రూపాయలకు పైగా ప్రజారోగ్య పరిరక్షణకు ఖర్చు చేస్తోందన్నారు. వ్యాధుల మూలంగా ప్రజలు ఆర్థికంగా నష్టపోవడమే గాక, శారీరకంగా కూడా బలహీనులవుతారని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వ్యాధులు వచ్చిన తరవాత చికిత్స కంటే వ్యాధులు రాకుండా నివారణకు ఎక్కువ ప్రాధాన్యత ఇస్తోందన్నారు. అందుకే ముఖ్యమంత్రి, మంత్రులు, ఎంఎల్‌ఎలు అందరూ స్వచ్ఛాంధ్ర, స్వచ్ఛ దివస్ కార్యక్రమంలో పాల్గొని ప్రజల్లో పరిశుభ్రతపై, అవగాహన, చైతన్యం తీసుకొస్తున్నారన్నారు. పరిసరాల అపరిశుభ్రత, డ్రెయినేజీల్లో మురుగునీరు నిల్వ కారణంగా దోమలు వ్యాప్తిచెంది మలేరియా, టైఫాయిడ్, చికెన్ గున్యా, డెంగీ వంటి విష జ్వరాలు ప్రబలే అవకాశం ఉందన్నారు. ప్రతి ఒక్కరూ శుభ్రత పాటిస్తే వ్యాధులు దరిచేరవన్నారు. పరిశుభ్రత ప్రతి ఒక్కరి జీవితంలో భాగం కావాలని, ప్రతి ఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు, పరిసరాల పరిశుభ్రతను కూడా పాటించినప్పుడే వ్యాధులు దరిచేరవని తెలిపారు. వ్యక్తిగత, పరిసర పరిశుభ్రత పై గతంలో కరోనా మనకు ఒక గుణపాఠం నేర్పిందన్నారు. నూజివీడు పట్టణంలో శానిటేషన్ కోసం త్వరలో యంత్రాలు కొనుగోలు మిషన్లతో వీధుల శుభ్రం చేస్తామన్నారు.



మొక్క నాటుతున్న మంత్రి పార్థసారధి

అనంతరం పాఠశాల విద్యార్థుల పర్యావరణ పరిరక్షణ, వ్యక్తిగత పరిసరాల పరిశుభ్రత ప్రాధాన్యతలను మంత్రి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సబ్ కలెక్టర్ బి.వినూత్న తహశీల్దార్ భద్రు, విద్యార్థులు, ప్రముఖులు పాల్గొన్నారు.

ప్రజలకు ఉచిత వైద్య విద్య, వైద్యం అందించాలి

సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

రాష్ట్రంలో మెడికల్ కాలేజీల విషయంలో అధికార, ప్రతిపక్ష పార్టీలు ఆడుతున్న కపటనాటకాలు కట్టిపెట్టి, ప్రజలకు మెరుగైన ఉచిత వైద్య విద్య, వైద్యం అందించే దిశగా పనిచేయాలని సిపిఎం ఏలూరు జిల్లా కమిటీ హితవు పలికింది. ఈ మేరకు పార్టీ జిల్లా కార్యదర్శి ఎ.రవి శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. గత వైసిపి ప్రభుత్వం మెడికల్ సీట్లు అమ్ముకోవడంలో శ్రద్ధ చూపిస్తే, నేడు కూటమి ప్రభుత్వం మెడికల్ కాలేజీలు అమ్మేసే పనిలో ఉందని తీవ్రంగా విమర్శించారు. అటు వైసిపి, ఇటు కూటమి ప్రభుత్వాలు మెడికల్ కాలేజీలను నాశనం చేసే దిశగానే పనిచేశాయని పేర్కొన్నారు. ప్రజల నుంచి వైద్యాన్ని దూరం చేసి ప్రయివేటు వారికి అప్పగించేందుకే జిఒలు తెచ్చాయని తెలిపారు. ఇప్పుడు వైసిపి తాము తెచ్చిన మెడికల్ కాలేజీలను మీరు అమ్మేస్తున్నారని ఆరోపణలు చేస్తుంటే కూటమి ప్రభుత్వం మీరు అసలు మెడికల్ కాలేజీలు కట్టలేదని విమర్శలు చేస్తూ అసలు విషయాలను పక్కదారి పట్టిస్తున్నారని తెలిపారు. ప్రభుత్వ మెడికల్ కాలేజీలను ప్రయివేటీకరణ చేయకుండా, మెడికల్ సీట్లు అమ్మకం జరగకుండా ఈ రెండు పార్టీలూ తెచ్చిన జిఒలను వెంటనే రద్దు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఏలూరు జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిని ఏలూరు ప్రభుత్వ కళాశాలగా మార్చడంతో జిల్లా ప్రధానాసుపత్రి హోదా కోల్పోయిందని, దాని ఫలితంగా పడకలు తగ్గిపోయాయని, సిబ్బంది కొరత ఏర్పడిందని, కేవలం రోగాలకు రిఫరెన్స్ రాసే ఆసుపత్రిగా మాత్రమే మిగిలిపోయిందని తెలిపారు. దీంతో ఏలూరు, చుట్టుపక్కల గ్రామాల నుంచి రోజుకు వందల సంఖ్యలో వచ్చి ఉచిత వైద్యం చేయించుకునే రోగులకు నేడు తీవ్ర అన్యాయం జరిగిందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం దీనిపై దృష్టి పెట్టి ప్రభుత్వ ఆసుపత్రులు రోగులకు దూరం కాకుండా, వారికి మరింత మెరుగైన వైద్యం ఉచితంగా అందించే ఆసుపత్రులుగా ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. ప్రభుత్వాలు ప్రజల అవసరాలను తీర్చేలా ఉండాలి తప్ప ఒకరిపై మరొకరు విమర్శలు చేసుకుంటూ ప్రజా సమస్యలను గాలికి వదిలేయడం సమంజసం కాదని పేర్కొన్నారు. ఇకనైనా కూటమి ప్రభుత్వం ప్రజలకు ఉచిత వైద్యం, విద్య అందించేందుకు తగు చర్యలు చేపట్టాలని కోరారు.

దస్తావేజు లేఖర్ల సమస్యలు పరిష్కరించాలి

రెండో రోజు కొనసాగిన పెన్‌డౌన్

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

దస్తావేజు లేఖర్ల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ రాష్ట్రవ్యాప్త పిలుపులో భాగంగా రెండో రోజు శనివారం దస్తావేజు లేఖర్లు పెన్‌డౌన్ కొనసాగించారు. ఈ సందర్భంగా ఏలూరు రిజిస్ట్రేషన్ కార్యాలయం వద్ద దస్తావేజు లేఖర్లు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర దస్తావేజు లేఖర్ల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు పివి.సుబ్బారావు మాట్లాడుతూ రిజిస్ట్రేషన్ చేసినప్పుడు కక్షిదారుల పేర్ల నమోదుకు పబ్లిక్ డేటా ఎంట్రీ చేసే సమయంలో ఒటిపి అడుగుతుందని, దానివల్ల కక్షిదారులు ఇబ్బందులు పడుతున్నారని, ఎవరికి ఆధార్ కార్డు నెంబర్లు, ఒటిపిలు చెప్పవద్దని బ్యాంకులు, పోలీసులు, రెవెన్యూ అధికారులు తెలియజేస్తున్న నేపథ్యంలో ఒటిపి చెప్పే పద్ధతి రద్దు చేయాలని కోరారు. గతంలో డేటా ఎంట్రీ చేసేటప్పుడు ఏమైనా తప్పులు జరిగితే జిల్లా రిజిస్ట్రార్ ఉత్తర్వులతో ఎడిట్ చేసే అవకాశం ఉండేదని, ఇప్పుడు ఆ ఎడిట్ ఆప్షన్ తీసివేయడంతో చాలా ఇబ్బందులు వస్తున్నాయని, ఎడిట్ ఆప్షన్ పునరుద్ధరించాలని కోరారు. కక్షిదారులకు, దస్తావేజు లేఖర్లకు ఇబ్బందులు లేకుండా చూడాలని కోరారు. అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు సముద్రాల నాగరాజు, ఏలూరు అధ్యక్షులు సముద్రాల దుర్గారావు, దాసరి సుబ్బారావు, పవన్ కుమార్, సముద్రాల కృష్ణమోహన్, పాపారావు పాల్గొన్నారు.



పెన్‌డౌన్ కార్యక్రమంలో దస్తావేజు లేఖర్లు

భీమడోలు : దస్తావేజుల లేఖర్లు చేపట్టిన పెన్‌డౌన్ కార్యక్రమం శనివారం రెండోరోజు కొనసాగింది. భీమడోలు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం ఎదుట చేపట్టిన నిరసన కార్యక్రమాలు కొనసాగాయి. సమస్యలను పరిష్కరించాలని ఆందోళనకారులు నినాదాలు చేశారు. ఈ కార్యక్రమానికి ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో దస్తావేజుల లేఖర్ల సంక్షేమ సంఘం కార్య నిర్వాహక కార్యదర్శి ఎన్.శ్రీరామ్ నాయకత్వం వహించారు. ఈ కార్యక్రమంలో నాయకులు వెజ్జు నాగేశ్వరరావు, వర్దినీడి బాలమురళీకృష్ణ, రాము ఆధ్వర్యంలో పలువురు దస్తావేజుల లేఖర్లు పాల్గొన్నారు.

భారీ వర్షం.. రోడ్లు జలమయం

వాహనదారుల అవస్థలు

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

నగరంలో వాతావరణం ఒక్కరోజులోనే భిన్నంగా మారింది. ఉదయం నుంచి ఎండ వేడిమి ప్రజలను ఇబ్బందులకు గురి చేసింది. సాయంత్రం సమయానికి వాతావరణ ఒక్కసారిగా మారిపోయింది. కమ్ముకొచ్చిన మేఘాలతో నగరమంతా చీకటిగా మారి భారీ వర్షం కురిసింది. ఉదయం ఎండ తీవ్రతకు ఇళ్ల నుంచి బయటకు రావడానికి ఇబ్బందులు ఎదుర్కొన్న ప్రజలు సాయంత్రం వాతావరణం మారడంతో కొంత ఊపిరి పీల్చుకున్నారు. అయితే భారీ వర్షం కారణంగా రహదారులన్నీ జలమయమయ్యాయి. వర్షం కారణంగా కొన్ని ప్రాంతాల్లో రోడ్లపై నీరు నిల్వ ఉండడంతో వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు.

ముదినేపల్లి : మండలంలో శనివారం సాయంత్రం వర్షం కురిసింది. ఈ వర్షంతో ముదినేపల్లి సెంటర్ జలమయమైంది. భారీ వర్షంతో రహదారులపై వర్షపు నీరు భారీగా చేరింది. గ్రామాల్లోని అంతర్గత రోడ్లపై వర్షపు నీరు ప్రవహించడంతో పాదచారులు, ద్విచక్ర వాహనదారులు తీవ్ర అవస్థలు పడ్డారు. దంచి కొట్టిన వర్షంతో లోతట్టు ప్రాంతాలు జలమయం అయ్యాయి. ముదినేపల్లి, పరిసర గ్రామాల్లోని పలు కాలనీల్లోకి వర్షపు నీరు చేరడంతో కాలనీవాసులు ఇబ్బందులు పడ్డారు. ఉరుములు, మెరుపులతో వర్షం కురవడంతో ప్రజలు భయాందోళన చెందారు. ఎండలకు చేలల్లో నీరు ఆవిరై చేలు ఎర్రబారాయి. కురిసిన వర్షం చేలకు ఉపయోగమని రైతులు చేస్తున్నారు. గరువు గ్రామాల్లోని చేలకు వర్షం చాలా మేలు చేసినట్లు రైతులు అంటున్నారు.



ఏలూరులో పడుతున్న వర్షం

వివాదాస్పద భూములను ఆర్అండ్‌ఆర్ ప్యాకేజీలో తీసుకోవద్దు

గిరిజన సంఘం జిల్లా ఉపాధ్యక్షులు తెల్లం దుర్గారావు

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

వివాదాస్పద భూములను ఆర్అండ్‌ఆర్ ప్యాకేజీలో తీసుకోవద్దని గిరిజన సంఘం జిల్లా ఉపాధ్యక్షులు తెల్లం దుర్గారావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండలంలోని మద్య బర్రింకలపాడులో జరిగిన పీసా గ్రామసభలో ఆర్అండ్‌ఆర్ ప్యాకేజీలో తీసుకున్న పలు భూములకు అభ్యంతరం తెలుపుతూ వినతి పత్రం ఇచ్చినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గిరిజన సాగులో ఉండి వివాదాస్పద భూములను ఆర్అండ్‌ఆర్ ప్యాకేజీలో తీసుకోవద్దని డిమాండ్ చేశారు. అనంతరం ఏజెన్సీ ప్రాంతంలో ఆయుధ డిపో ఏర్పాటును వ్యతిరేకిస్తూ ఈ నెల 23న జరిగే నేవీ ఆయుధ డిపో వ్యతిరేక భారీ ప్రదర్శనలో ఏజెన్సీ నలుమూలల నుంచి గిరిజనులు పెద్ద ఎత్తున పాల్గొంటామని తెలిపారు. ఏజెన్సీ ప్రాంతంలో ఆయుధ డిపోకు సంబంధించి డంపింగ్‌ను ఎక్కడా పెట్టనివ్వబోమని గతంలో జరిగిన గ్రామసభల్లో ఏకగ్రీవంగా నిర్ణయం తీసుకున్నట్లు గుర్తు చేశారు. అనంతరం ఆదివాసీ సంక్షేమ పరిషత్ అధ్యక్షుడు కాకి మధు మాట్లాడుతూ ఆదివాసీలు తరతరాలుగా ఏజెన్సీ ప్రాంతంలో జీవిస్తుంటే ఇప్పుడు ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ, ఆయుధాల పేరుతో గిరిజనులను ఏజెన్సీ నుంచి తరలించే కుట్ర జరుగుతుందన్నారు. అదే విధంగా గిరిజన సాగులో ఉన్న భూములకు తప్పుడు పత్రాలు సృష్టించి ఆర్అండ్‌ఆర్ ప్యాకేజీలో డబ్బులు దండుకోవాలని గిరిజనేతరులు, భూస్వాములు ఎత్తుగడలు వేస్తున్నారని, వారి ఆటలు సాగనివ్వబోమని హెచ్చరించారు. గ్రామసభల్లో అభ్యంతరాలు తెలిపే భూములను తక్షణమే ఆర్అండ్‌ఆర్ ప్యాకేజీ నుంచి తొలగించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచి వనమా, పీసా కమిటీ ఉపాధ్యక్షులు పొట్ట కామరాజు, కార్యదర్శి కుంజా భీముడు, తదితర నాయకులు పాల్గొన్నారు.




వినతిపత్రం అందిస్తున్న నేతలు

విద్యుత్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

కొనసాగిన రిలే నిరాహార దీక్షలు

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

విద్యుత్ ఉద్యోగుల న్యాయమైన సమస్యలు పరిష్కరించాలని కోరుతూ స్థానిక విద్యుత్ భవన్ వద్ద ఆంధ్రప్రదేశ్ స్టేట్ పవర్ ఎంప్లాయీస్ జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో చేపట్టిన విద్యుత్ ఉద్యోగుల రిలే నిరాహార దీక్ష రెండో రోజు శనివారం కొనసాగింది. సుమారు వంద మంది విద్యుత్ ఉద్యోగులు దీక్ష శిబిరంలో కూర్చున్నారు. ఈ సందర్భంగా ఐదు జిల్లాల డిస్కం జెఎసి కన్వీనర్ భూక్య నాగేశ్వరరావు మాట్లాడుతూ రాష్ట్రంలో విద్యుత్ శాఖలో ఉన్న 25 వేల మంది పర్మినెంట్ ఉద్యోగులు, 26 వేల మంది కాంట్రాక్ట్ ఉద్యోగులు అనేక సంవత్సరాల నుంచి పెండింగ్‌లో ఉన్న సమస్యల పరిష్కారం కోసం దశల వారి ఆందోళన కార్యక్రమాలు చేస్తున్నారని, వారి న్యాయమైన కోర్కెలు తీర్చేందుకు విద్యుత్ యాజమాన్యాలు ముందుకు రావాలని కోరారు. ఉద్యమం మొదలుపెట్టి ఐదు రోజులు గడిచినప్పటికీ యాజమాన్యాలు ముందుకు రాకపోవడం దారుణమన్నారు. 1999 ఫిబ్రవరి ఒకటో తేదీ తర్వాత ఉద్యోగంలో చేరిన ఉద్యోగులకు పెన్షన్ సౌకర్యం కల్పించాలని, జూనియర్ లైన్‌మెన్ గ్రేడ్-2 ఉద్యోగులకు పాత సర్వీస్ కండిషన్స్ అమలు చేయాలని, వారికి ప్రమోషన్ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. సంస్థలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులందరినీ రెగ్యులర్ చేయాలని, సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని కోరారు. ఈ నెల 22వ తేదీన జరిగే శాంతి ర్యాలీని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా జెఎసి ఛైర్మన్ ఎం.రమేష్, జిల్లా కన్వీనర్ వి.రాము, డిస్కం కో కన్వీనర్ తురగా రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.




రిలే నిరాహార దీక్షల్లో ఉద్యోగులు

సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలి

ఎంఎల్‌ఎకు భవన నిర్మాణ కార్మిక సంఘం వినతి

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలని కోరుతూ భవన నిర్మాణ కార్మిక సంఘం (సిఐటియు) నాయకులు ఏలూరు ఎంఎల్‌ఎ బడేటి చంటికి శనివారం ఆయన క్యాంపు కార్యాలయంలో వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు ఎర్ర రాంబాబు మాట్లాడుతూ భవననిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలని కోరారు. గత వైసిపి ప్రభుత్వం 1214 మెమో ఇచ్చి సంక్షేమ పథకాలు నిలుపుదల చేసిందని, కూటమి ప్రభుత్వం అధికారంలోకొచ్చిన వంద రోజుల్లో భవన నిర్మాణ కార్మికులకు సంక్షేమ పథకాలు అమలు చేస్తామని సిఎం చంద్రబాబు ఇచ్చిన హామీను అమలు చేయాలని కోరారు. ప్రస్తుతం అసెంబ్లీ సమావేశాలు జరుగుతున్నందున భవన నిర్మాణ కార్మికుల సమస్యను అసెంబ్లీలో సిఎం దృష్టికి తీసుకురావాలని కోరారు. ఎంఎల్‌ఎ చంటి మట్లాడుతూ నిర్మాణ కార్మికుల సమస్యలు సిఎం దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిస్కారం కోసం కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో యూనియన్ కార్యదర్శి గురజోలు సాంబశివరావు, ఎర్రంశెట్టి సుబ్బారావు, పరస శ్రీనివాసరావు పాల్గొన్నారు.



వినతిపత్రం అందిస్తున్న భవన నిర్మాణ కార్మిక సంఘం నేతలు

వీఆర్ఏల సమస్యలు పరిష్కరించాలి

కలెక్టరేట్ వద్ద ధర్నా

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

జిల్లాలో గ్రామ రెవెన్యూ అసిస్టెంట్లుగా పనిచేసే ఉద్యోగులకు జీతాలు పెంచాలని కోరుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గ్రామ రెవెన్యూ సహాయకుల సంఘం ఆధ్వర్యంలో శనివారం ఏలూరు కలెక్టరేట్ వద్ద నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా కార్యదర్శి ఎస్.సాంబశివరావు మాట్లాడుతూ గ్రామాల్లో పనిచేసే వీఆర్ఏలకు ఉద్యోగ భద్రత కల్పించాలని, అంతేకాకుండా పే స్కేలు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. రెవెన్యూ డిపార్ట్‌మెంట్‌కి సంబంధించి అందరికీ న్యాయం చేశారని, తమకు మాత్రమే అన్యాయం జరుగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుతం వీఆర్ఏలకు రూ.10,500 వరకు జీతాలు చెల్లిస్తున్నారని, ఇది ఏమాత్రం కుటుంబ పోషణకు సరిపోవటం లేదని, తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని తెలిపారు. చనిపోయిన వీఆర్ఏ కుటుంబ సభ్యులకు ఉద్యోగాలు కల్పించాలన్నారు. ప్రమోషన్లు సైతం ఇవ్వాల్సిన అవసరం ఉందని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఉంగుటూరు మండల వీఆర్ఏ సంఘం అధ్యక్షులు ఎం.అంజనేయులు, వీఆర్ఏలు దినేష్ బాబు, పెద్దిరాజు, లలిత, సంధ్యారాణి, కుమారి, తదితరులు పాల్గొన్నారు.

అర్హులైన మహిళలకు అంత్యోదయ కార్డులు ఇవ్వాలి

కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి ఫ్రాన్సిస్

ప్రజాశక్తి - బుట్టాయగూడెం

అర్హులైన మహిళలకు అంత్యోదయ కార్డు ఇవ్వాలని, ఎన్నికల సమయంలో మహిళలకు కూటమి ఇచ్చిన హామీలు అమలు చేయాలని కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి ఎ.ఫ్రాన్సిస్ డిమాండ్ చేశారు. ఈ మేరకు తహశీల్దార్ కార్యాలయం వద్ద ఏజెన్సీ దళిత ఎస్‌టి, బిసి మైనార్టీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో శనివారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఫ్రాన్సిస్ మాట్లాడుతూ టిడిపి కూటమి అధికారంలోకొచ్చి 16 నెలలు గడుస్తున్నా మహిళలకు ఇచ్చిన హామీలు అమలు చేయడంలో విఫలమయ్యారన్నారు. అర్హులైన మహిళలను గుర్తించి అంత్యోదయ కార్డులు ఇవ్వాలని కోరారు. దళిత గిరిజన పేద కుటుంబాలను ఆదుకోవాలన్నారు. రెడ్డి గణపవరం, బుట్టాయగూడెం, అచ్చియపాలెం తదితర గ్రామాల నుంచి ప్రజలు అధిక సంఖ్యలో హాజరై తహశీల్దార్ చలపతికి అర్జీలను అందించారు. తహశీల్దార్ మాట్లాడుతూ సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో అన్నపూర్ణ, శివుడు, సావిత్రి, బొబ్బర మరియమ్మ, తిరుపేదుల సూరమ్మ, మల్లిపూడి బాయమ్మ, ఎం.లలితకుమార్, కె.రాధ, ఎం.మార్తమ్మ, బి.బేబీ, ఎం.రాధ, తలారి రాణి, తదితరులు పాల్గొన్నారు.

వ్యకాస మండల కమిటీ ఎన్నిక

ప్రజాశక్తి - టి.నరసాపురం


గంగాభవాని


రాజు

వ్యవసాయ కార్మిక సంఘం మండలాధ్యక్షులుగా బొడ్డు గంగాభవాని, కార్యదర్శిగా బొడ్డపాటి రాజులు మండల మహాసభ ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ఆ సంఘం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు గుడెల్లి వెంకట్రావు తెలిపారు. శనివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ మండల పరిధిలో అనేక సమస్యలు నెలకొన్నాయని రోడ్లు, డ్రైనేజీలు, ఇళ్ల స్థలాలు, ఇళ్ల పట్టాలు వంటి సమస్యలు నేటికీ కొనసాగుతున్నాయని అన్నారు. ఉపాధి హామీ పని ప్రాంతాల్లో నెలకొన్న సమస్యల పరిష్కారానికి వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో నిరంతరం పనిచేసే విధంగా నూతన కమిటీ ముందుకు నడవాలని కోరారు. గ్రామాల్లో సమస్యల పరిష్కారం కోసం కమిటీ కార్యాచరణ రూపొందించుకోవాలని సూచించారు. ప్రజా సమస్యలపై పోరాడాలని తెలిపారు. మండల ఉపాధ్యక్షులుగా కలపాల గాంధీ, సహాయ కార్యదర్శిగా కలపాల చెల్లమ్మ, కమిటీ సభ్యులుగా కాకి సిరమయ్య, పొట్ట ముత్యాలరావు, కుంజా పద్మ, తదితరులు ఎన్నికయ్యారు.

ఘనంగా రోటరీ క్లబ్ ఆవిర్భావ దినోత్సవం

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

శ్రీ మల్లాది సీతా రామలింగేశ్వర రోటరీ కమ్యూనిటీ హాలులో ప్రెసిడెంట్ పెనుమర్తి సురేష్‌బాబు, సెక్రటరీ సంధ్య ప్రవల్లిక ఆధ్వర్యంలో కెఎల్‌ఎన్.ధనకుమార్ నిర్వహణలో రోటరీ క్లబ్ చార్టర్ నైట్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చార్టర్ మెంబర్స్ మల్లాది సీతారామారావును, చామర్తి శ్రీరాములును జ్ఞాపిక, శాలువా, పూలమాలలతో సత్కరించారు. రోటరీ క్లబ్ ప్రెసిడెంట్ సురేష్ బాబు మాట్లాడుతూ రోటరీ అభ్యుదయానికి ఎంతో పాటుపడుతూ ప్రతి ఏడాది ఆయా కార్యవర్గాలను సభా నిర్వహణ, మరెన్నో బాధ్యతలు చేపడుతున్న కెఎల్‌ఎన్.ధనకుమార్‌ను 2025 బిజినెస్ ఇ అవార్డు అందుకున్న సందర్భంగా దాకారపు కృష్ణను మెమెంటో, శాలువా పూలమాలలతో సత్కరించారని తెలిపారు. సెక్రటరీ సంధ్య ప్రవల్లిక ఆధ్వర్యంలో లాలిత్య చౌదరి సహకారంతో చక్కని ఆటపాటలు నిర్వహించగా సభ్యులంతా పాల్గొని ఆనందించారు. ఆటల్లో విజేతలకు పెద్దలచే బహుమతులు అందించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో రోటరీ సభ్యులు కుటుంబ సమేతంగా పాల్గొని విందు వినోదాలతో ఆనందంగా గడిపారు.

విద్యార్థులకు హైజానిక్ కిట్లు అందజేత

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

తేజో సూర్య ఫౌండేషన్ వారి ఆధ్వర్యంలో శనివారపుపేట జిల్లా పరిషత్ హై స్కూల్, రామకోటి వద్ద ఉన్న జిల్లా పరిషత్ బాలికల హై స్కూల్‌లో విద్యార్థులకు మెన్స్ట్రువల్ హెల్త్ అండ్ హైజానిక్ కిట్స్‌ను శనివారం అందించారు. ముఖ్యఅతిథిగా ఏలూరు ఎంఎల్‌ఎ బడేటి చంటి హాజరయ్యారు. స్కూలు యాజమాన్యం, విద్యార్థులు ఆయనను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఇడా ఛైర్మన్ శివప్రసాద్, మేయర్ షేక్ నూర్జహాన్ పెదబాబు, డిఇఒ వెంకటలక్ష్మమ్మ, టిడిపి నగర ప్రెసిడెంట్ చోడే వెంకటరత్నం, స్కూల్ ప్రిన్సిపల్ బి.త్రిపుర సుందరాదేవి, తేజో సూర్య ఫౌండేషన్ అధినేత తేజో సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

నేరాలు - ఘోరాలు

ఎరువుల అక్రమ నిల్వలు సీజ్

విజిలెన్స్ డిఎస్‌పి వెంకటేశ్వరరావు

ప్రజాశక్తి - జీలుగుమిల్లి


తనిఖీలు చేస్తున్న విజిలెన్స్ అధికారులు

జీలుగుమిల్లిలోని సాధుట్రేడర్స్, విజయ ట్రేడర్స్‌లకు చెందిన రెండు ఎరువుల దుకాణాల్లో అక్రమ నిల్వలను సీజ్ చేసినట్లు విజిలెన్స్ డిఎస్‌పి ఎస్.వెంకటేశ్వరావు తెలిపారు. శనివారం సాయంత్రం రెవెన్యూ, వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో విజిలెన్స్ అధికారులు దాడులు చేశారు. జీలుగుమిల్లిలో ఉన్న సాధు ట్రేడర్స్, విజయ ట్రేడర్స్‌లకు చెందిన ప్రయివేటు దుకాణాల్లో తనిఖీ చేయగా విజయ ట్రేడర్స్‌లో లైసెన్స్ లేకుండా రూ.3,52,113 విలువైన 3.631 టన్నుల అక్రమ నిల్వలను గుర్తించినట్లు తెలిపారు. ఈ ఎరువులను సీజ్ చేసి దుకాణ యజమాని ధనుంజయపై క్రిమినల్ కేసు నమోదు చేసినట్లు డిఎస్‌పి తెలిపారు. సాధు ట్రేడర్స్ లో దాడి చేయగా రూ.1,89,410 విలువైన 19.800 టన్నుల అక్రమ నిల్వలను గుర్తించినట్లు తెలిపారు. సరుకును స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

ఎర్రకాలువ ప్రాజెక్టులో దిగిన వ్యక్తి మృతి

ప్రజాశక్తి - టి.నరసాపురం

గేదెల కోసం ఎర్రకాలువ ప్రాజెక్టులో దిగిన మృతి చెందిన సంఘటన మండలంలోని బొర్రంపాలెంలో శనివారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... కృష్ణా జిల్లా బాపులపాడు మండలం కొత్తపల్లి గ్రామానికి చెందిన గోనె జయరాజు (25) సుమారు 15 ఏళ్ల నుంచి మండలంలోని బొర్రంపాలెం శివారు సూరంపూడికి చెందిన వరికూటి మంగయ్య గేదెలను కాస్తూ అక్కడే నివాసం ఉంటున్నాడు. ఈ క్రమంలో ఈ నెల 19వ తేదీన ఎప్పటిలాగే ఉదయం సూరంపూడి శివారు ఎర్ర కాలువ ప్రాజెక్టు వద్దకు గేదెలను తోలుకొని వెళ్లి సాయంత్రం అయినా ఇంటికి రాలేదు. అతని ఆచూకీ కోసం వెతుకుతుండగా ప్రాజెక్టు లోపల నీటిలో అతని మృతదేహం కనిపించింది. గేదెలు నీటిలో నుంచి బయటకు రాలేదని వాటిని తోలుకొని రావడానికి నీటిలో దిగి ప్రమాదవశాత్తూ నీటిలో మునిగి చనిపోయినట్లు తగు చర్య నిమిత్తం మృతుని సోదరి కోరం ఏసుమణి ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్ కానిస్టేబుల్ ఎం.రాజు తెలిపారు.

24న మహాధర్నా : సిఐటియు

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

మధ్యాహ్న భోజన కార్మికుల పెండింగ్ వేతనాలు, బిల్లులు చెల్లించాలని కోరుతూ ఈ నెల 24న కలెక్టరేట్ వద్ద జరుగే మహాధర్నా వాల్‌పోస్టర్‌ను నూజివీడు పట్టణంలో సిఐటియు నేతలు శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా కార్యదర్శి జి.రాజు మాట్లాడుతూ మధ్యాహ్న భోజన పథకం కార్మికులకు రెండు నెలల పెండింగ్ వేతనాలు, బిల్లులు వెంటనే చెల్లించాలని కోరారు. కార్మికులకు కనీస వేతనం రూ.పది వేలు ఇవ్వాలని, స్కూల్ విద్యార్థులకు మెనూ ఛార్జీలు కనీసం రూ.20, కాలేజీ విద్యార్థులకు రూ.45 ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో మిడ్ డే మీల్స్ స్కూల్ పేపర్ యూనియన్ నాయకులు దుర్గ, పోతురాజు, తదితరులు పాల్గొన్నారు.

నిందితులకు శిక్షలు పడేలా చూడాలి

ప్రజాశక్తి - ఏలూరు స్పోర్ట్స్

కేసుల్లో నిందితులకు శిక్షలు పడే విధంగా చూసే బాధ్యత కోర్టు మానిటరింగ్ సెల్ సభ్యులపై ఉందని ఎస్‌పి ప్రతాప్‌శివకిషోర్ అన్నారు. నగరంలోని జిల్లా పోలీస్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో ఏలూరు, పోలవరం, జంగారెడ్డిగూడెం సబ్ డివిజన్ల పరిధిలో పనిచేస్తున్న కోర్టు మోనిటరింగ్ సభ్యులతో శనివారం రాత్రి రివ్యూ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్‌పి మాట్లాడుతూ సాక్షులను సరైన సమయాల్లో ప్రవేశపెట్టి నిందితులకు శిక్షలు పడేవిధంగా చర్యలు చేపట్టాలని సూచించారు.


పుస్తకాలు పంపిణీ చేస్తున్న దాతలు

విద్యార్థులకు పుస్తకాల పంపిణీ

ప్రజాశక్తి - దెందులూరు

పెదవేగి మండలం రామసింగవరం పాఠశాలలో ప్రైమరీ, హై స్కూల్ విద్యార్థులకు నేరెళ్ల హోండా షోరూం ఆధ్వర్యంలో వైట్ నోట్ బుక్స్, పెన్నులు, పెన్సిళ్లు అందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు టివి.పద్మావతి, మోడల్ ప్రైమరీ ప్రధానోపాధ్యాయులు శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు పరసా నాగార్జున, లక్ష్మీనారాయణ, గుడ్ల సాయి శ్రీనివాస్, శ్రీను, లాజరు తదితరులు పాల్గొన్నారు

ఎన్‌ఎంఎంఎస్ పరీక్షలకు విద్యార్థులు సన్నద్ధం కావాలి

ప్రజాశక్తి - టి.నరసాపురం

కేంద్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న ఎన్‌ఎంఎంఎస్ ప్రవేశ పరిక్షకు విద్యార్థులు ప్రణాళికా బద్ధంగా సన్నద్ధం కావాలని మండలంలోని బొర్రంపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థి జూడాల వెంకటేశ్వరరావు సూచించారు. స్థానిక పాఠశాలలో శనివారం ఎనిమిదో తరగతి చదువుతున్న సుమారు 25 మంది విద్యార్థులకు ఎన్‌ఎంఎంఎస్ ప్రవేశ పరీక్షకు కావాల్సిన విద్యాసామగ్రిని పాఠశాల పూర్వ విద్యార్థి జూడాల వెంకటేశ్వరరావు ఉచితంగా అందించారు.

జాతీయ స్థాయి పోటీల్లో ఆదిత్య విద్యార్థి ప్రతిభ

ప్రజాశక్తి - ఏలూరు


ధనుష్‌ను అభినందిస్తున్న స్కూల్ యాజమాన్యం

స్థానిక ఆదిత్య స్కూల్‌లో ఆరో తరగతి చదువుతున్న ధనుష్ సోమలింగాచారి సెప్టెంబర్ 14వ తేదీన కర్నూల్ కన్వెన్షన్ హాలులో జరిగిన జికెఎంఎఎస్ 12వ జాతీయ స్థాయి కరాటే ఛాంపియన్ షిప్ 2025 పోటీల్లో అద్భుత ప్రతిభ కనబరిచి వరుసగా సిల్వర్, బ్రౌంజ్ మెడల్ సాధించాడని స్కూల్ డైరెక్టర్ లయన్స్ డాక్టర్ ఆదిత్యకృష్ణంరాజు శనివారం తెలిపారు. ఇప్పటికీ అనేక రాష్ట్ర, జాతీయస్థాయి మెడల్స్ సాధించారని, ఇక ముందు కూడా మరింత మెరుగ్గా రాణించాలని ప్రోత్సహిస్తున్న తల్లి దండ్రులు ప్రసాద్, మౌనికను శిక్షణ నిస్తున్న కరాటే మాస్టర్ సుభానిని ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో స్కూల్ ప్రిన్సిపల్ టి.శ్రీనివాస్, బి.యుగసుధ, కెవి.సత్యనారాయణ, ఉపాధ్యాయ, ఉపాధ్యాయేతర సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులు క్రీడల్లోనూ రాణించాలి

ముగిసిన మండల స్థాయి ఆటల పోటీలు

ప్రజాశక్తి - ముసునూరు

చదువుతో పాటు విద్యార్థులు క్రీడల్లో కూడా ఆసక్తి చూపాలని మండల విద్యాశాఖాధికారి బివిఎస్.సుబ్బారావు అన్నారు. మండల కేంద్రమైన ముసునూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మండల స్థాయి ఆటలు పోటీలు ముగింపు రోజు శనివారం వ్యాయామ ఉపాధ్యాయులైన హేమ, రామచంద్రుడు, వాకా నాగరాజు, నాగమల్లేశ్వరి ఆధ్వర్యంలో షటిల్, కోకో, కబడ్డీ, వాలీబాల్, చెస్, యోగా అథ్లెటిక్స్ పోటీలు అండర్ 14, అండర్ 17, విభాగాల్లో నిర్వహించారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు మండల స్థాయి నుంచి డివిజన్ స్థాయి పోటీల్లో పాల్గొనే విధంగా ప్రశంసాపత్రాలు అందించారు. ఈ కార్యక్రమంలో తెలుగు యువత నియోజకవర్గ కార్యదర్శి కొండేటి బాబి, ప్రధానోపాధ్యాయులు డి.శైలజ, తహశీల్దార్ డి.ప్రశాంతి, ఎంపిడిఒ బసవరాజు అచ్యుత సత్యనారాయణ, ఉపాధ్యాయులు గంగుల నాగేశ్వరరావు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రపంచ శాంతి కోసం కృషి చేయాలి

ప్రజాశక్తి - ఏలూరు


ప్రతిజ్ఞ చేస్తున్న స్కూల్ యాజమాన్యం, విద్యార్థులు

ప్రపంచ వ్యాప్తంగా అనేక దేశాల మధ్య జరుగుతున్న యుద్ధాలతో మొత్తం మానవాళికే ప్రమాదం ఏర్పడిందని, ఇటువంటి సమయంలో ప్రపంచ శాంతి కోసం ప్రతిఒక్కరూ కృషి చేయాలని ఆదిత్య స్కూల్ ప్రిన్సిపల్ టి.శ్రీనివాస్ అన్నారు. సెప్టెంబరు 21న ప్రపంచ శాంతి దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం స్థానిక ఆదిత్య స్కూల్‌లో ఇంటర్నేషనల్ లయన్ క్లబ్ ఆధ్వర్యంలో లయన్స్ క్లబ్ జోన్ ఛైర్ పర్సన్ వెస్ట్ చెర్రీ స్కూల్ డైరెక్టర్ ఎల్ఎన్.మహేష్‌కుమార్ విద్యార్థులచే ప్రపంచ శాంతి ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా స్కూల్ ప్రిన్సిపల్ టి.శ్రీనివాస్ మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే శాంతి, సౌభ్రాతృత్వం, సమ సమాజం పట్ల అవగాహన కలిగి ఉండాలని, దాని కోసం నిరంతరం నిశ్వార్థంగా శ్రమిస్తున్న లయన్స్ క్లబ్ వారిని అభినందించారు. ఈ కార్యక్రమంలో స్కూల్ ప్రిన్సిపల్ టి.శ్రీనివాస్, బి.యుగసుధ, ఎస్‌కె.బాబా, ఉపాధ్యాయ, ఉపాధ్యాయేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

'నూరు శాతం అక్షరాస్యతే అక్షరాంధ్ర ముఖ్య ఉద్దేశం'

ప్రజాశక్తి - టి.నరసాపురం

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న అక్షరాంధ్ర కార్యక్రమాన్ని మండలంలోని ప్రతి గ్రామంలో అమలు చేయాలని, ఆయా గ్రామాల్లో ఉన్న నిరక్షరాస్యులైన మహిళలను ఉపాధి హామీ చట్టంలోని పురుషులను అక్షరాస్యులుగా మార్చే కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వయోజన విద్యాశాఖ డిప్యూటీ డైరెక్టర్ జిసిహెచ్.ప్రభాకర్ తెలిపారు. మండల కేంద్రమైన టి.నరసాపురంలో ఉన్న మూడు అక్షర కేంద్రాలను సందర్శించి అభ్యాసకులకు విలువైన సూచనలను అందించారు. ఈ సందర్భంగా అసిస్టెంట్ ప్రాజెక్ట్ ఆఫీసర్ ఆర్.విజయకుమార్ మాట్లాడుతూ మండలంలో 2400 మంది డ్వాక్రా మహిళలను, వెయ్యి మంది ఉపాధి హామీలోని పురుషులను అక్షరాస్యులుగా మార్చాలని లక్ష్యంగా పెట్టారని తెలిపారు.

27 మంది గ్రామీణ బ్యాంక్ ఉద్యోగులు రక్తదానం

ఏలూరు అర్బన్ :విజిలెన్స్ అవగాహనా వారోత్సవాల్లో భాగంగా రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో శనివారం స్థానిక సత్రంపాడులోని ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంక్‌లో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరంలో 27 మంది బ్యాంకు ఉద్యోగులు రక్తదానం చేశారని జిల్లా రెడ్ క్రాస్ ఛైర్మన్ డాక్టర్ ఎంబిఎస్‌వి.ప్రసాద్ తెలిపారు.. రక్తదానం చేసిన దాతలకు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో విజిలెన్స్ ఇన్‌ఛార్జి బి.హరీష్, రీజినల్ మేనేజర్ యు.శ్రీదేవి, డాక్టర్ వరప్రసాదరావు, పిఆర్‌ఒ కెవి.రమణ, తదితరులు పాల్గొన్నారు.

మహిళలు ఆరోగ్యం పట్ల శ్రద్ధ తీసుకోవాలి

ప్రజాశక్తి - పెదపాడు

మహిళలు ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని దెందులూరు ఎఎంసి ఛైర్మన్ గారపాటి రామసీత అన్నారు. స్వస్థ్ నారీ స్వశక్తి పరివార్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా వట్లూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని కొక్కిరపాడులో శనివారం మహిళల ఆరోగ్య సంరక్షణకు ప్రత్యేక వైద్యశిబిరం నిర్వహించారు. ఈ శిబిరాన్ని ప్రారంభించిన రామసీత మాట్లాడుతూ మహిళలు పౌష్టికాహారం తీసుకోవడం ద్వారా ఆరోగ్యంగా ఉంటారన్నారు. అలాగే ఏ చిన్న ఆరోగ్య సమస్య వచ్చినా అశ్రద్ధ చేయకుండా వైద్యుల సలహాలు తీసుకోవాలన్నారు. కొక్కిరపాడు పంచాయతీ పరిధిలోని వేంపాడు, దాసరి గూడెం, హరిజనవాడ, కొక్కిరపాడు గ్రామాల ప్రజలకు ఎలాంటి ఆరోగ్య సమస్య వచ్చినా వైద్యసిబ్బంది అందు బాటులో ఉండేలా చర్యలు తీసుకున్నామని తెలిపారు. అనంతరం పిహెచ్‌సి వైద్యులు మాధవీలత మహిళలకు, చిన్నారులకు, వివిధ రకాల వ్యాధిగ్రస్తులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారికి ఉచితంగా మందులు అందించారు. ఈ శిబిరంలో పంచాయతీ పరిధిలోని సుమారు 263 మందికి వైద్యపరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్లు, ఎఎన్‌ఎంలు, ఆశా, అంగన్‌వాడీ కార్యకర్తలు, వైద ఆరోగ్య సిబ్బంది భానుపరం జ్యోతి, కుసుమ, పాతూరి అనూష, బెజవాడ సీతామహాలక్ష్మి పాల్గొన్నారు.


మాట్లాడుతున్న దెందులూరు ఎఎంసి ఛైర్మన్ రామసీత

భీమడోలు :మహిళల ఆరోగ్య పరిరక్షణకు ప్రత్యేకించిన స్వస్థ్ నారీ స్వశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమ సేవలను వినియోగించుకోవాలని ఆప్కాబ్ ఛైర్మన్ గన్ని వీరాంజనేయులు కోరారు. భీమడోలు సామాజిక ఆరోగ్య కేంద్రంలో కేంద్ర పర్యవేక్షకులు డాక్టర్ ఎన్.సునీత ఆధ్వర్యంలో శనివారం కార్యక్రమాలు నిర్వహించారు. వివిధ ప్రాంతాలకు చెందిన 12 మంది ప్రత్యేక వైద్య నిపుణుల శిబిరంలో వైద్య సేవలను అందించారు. అనంతరం శిబిర నిర్వహణలో భాగంగా ఆరోగ్య కేంద్రం పర్యవేక్షకుల చొరవతో రక్తదానానికి ముందుకొచ్చిన 15 మంది శ్రీ వెంకటేశ్వర కాలేజీకి చెందిన విద్యార్థులను అభినందించారు.

ముసునూరు :తల్లి, బిడ్డ ఆరోగ్యకరంగా క్షేమంగా ఉండాలంటే గర్భిణులు, బాలింతలు పౌష్టికాహారం తీసుకోవాలని సూపర్‌వైజర్ రాజ్యలక్ష్మి తెలిపారు. మండలంలోని చెక్కపల్లిలో ఎనిమిదో రాష్ట్రయ పోషణ కార్యక్రమం స్వస్థ్ నారీ స్వశక్తి పరివార్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా బాలింతలకు, గర్భిణులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో వైద్యులు షకీనా ఇవాంజెలిన్, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఏలూరు సిటీ : ఏలూరులోని జెపి కాలనీలో యుపిహెచ్‌సి పరిధిలో స్వస్థ్ నారి స్వశక్త్ పరివార్ అభియాన్, పోషన్ ఎనిమిదో రాష్ట్రీయ పోషణ 2025 కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా ప్రాజెక్ట్ డైరెక్టర్ ఎ.పద్మావతి హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో యుపిహెచ్‌సి డాక్టర్ నీలిమ, థర్డ్ సెక్టార్ సూపర్‌వైజర్ మీనాక్షి, అంగన్వాడీ కార్యకర్తలు, ఎఎన్‌ఎంలు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రత తప్పనిసరి : డిఎంహెచ్‌ఒ అమృతం

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

ప్రతిఒక్కరూ పరిసరాల పరిశుభ్రత పాటించడం ద్వారా అంటువ్యాధుల నుంచి దూరంగా ఉండొచ్చని ఏలూరు జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ పిజె.అమృతం సూచించారు. స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా స్థానిక ఏలూరు మోతేవారితోట పట్టణ ఆరోగ్య కేంద్రం సందర్శించి ప్రజలకు పలు అంశాలపై అవగాహన కల్పించారు. అనంతరం సిబ్బంది స్థానిక ప్రజలతో స్వర్ణాంధ్ర ప్రతిజ్ఞ నిర్వహించి ఆసుపత్రి ప్రాంగణంలో మొక్కలు నాటారు. బేటి బచావో బేటి పడావో కార్యక్రమం నిర్వహించారు. జిఎన్‌టి రోడ్డులో మున్సిపల్ కార్పొరేషన్ వారి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఏలూరు ఎంఎల్‌ఎ బడేటి చంటి హాజరయ్యారు. పారిశుధ్యంలో మంచి ప్రతిభ కనబర్చిన ముగ్గురు శానిటేషన్ కార్మికులకు తన సొంత నిధులు రూ.ఐదు వేలు, మెమొంటో అందించారు. మొక్కలు నాటారు.

కొయ్యలగూడెం :మండలంలోని పొంగుటూరు గ్రామంలో స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర కార్యక్రమం నిర్వహించారు. ప్లాస్టిక్ నిషేధం, చెత్త నిర్వహణపై ర్యాలీ నిర్వహించారు. హరిత రాయబారులు (క్లాప్ మిత్రాలు) అందిస్తున్న సేవలకు సన్మానించి, దుస్తులు పంపిణీ చేశారు. ఇంటింటికీ చెత్త సేకరణలో భాగంగా పారిశ్రామికవేత్త కొల్లూరు సత్తిబాబు 50 గృహాలకు తడి, పొడి చెత్త వేరుగా వేసే టబ్బులను ఉచితంగా పంపిణీ చేశారు. గ్రామ ప్రజల కోసం రూ.ఎనిమిది లక్షల వ్యయంతో మంచినీటి ప్లాంట్ ఏర్పాటు చేసి త్వరలోనే ఉచితంగా ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తానని కొల్లూరు సత్తిబాబు తెలిపారు.

కుక్కునూరు :మండలంలో స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమం నిర్వహించారు. ఎంపిడిఒ నరసింహారావు మాట్లాడుతూ పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచి ఇ.వీరస్వామి, రాజులు ఎంఆర్‌సి రమేష్, టిడిపి సీనియర్ నాయకులు కోటగిరి సత్యనారాయణ, వైసిపి నాయకులు రాయి సత్యనారాయణ, సచివాలయ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శి నాగదుర్గ, తదితరులు పాల్గొన్నారు.

ఏలూరు అర్బన్ :స్థానిక పత్తేబాదలోని రెడ్ క్రాస్ నర్సింగ్ కళాశాల ఆవరణలో రెడ్ క్రాస్, మానవత సంయుక్త ఆధ్వర్యంలో శనివారం స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రెడ్ క్రాస్ జిల్లా ఛైర్మన్ డాక్టర్ ఎంబిఎస్‌వి.ప్రసాద్ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో రెడ్ క్రాస్ కార్యదర్శి బి.బెన్నీ, రెడ్ క్రాస్ కమిటీ సభ్యులు ఆలపాటి నాగేశ్వరరావు, ఎంవివిఎస్.నాగేశ్వరరావు, ఎ.నిర్మల, ఎం.అజయ్‌బాబు, ఏలూరు మానవత అధ్యక్షులు ఎంఎస్‌ఎంఎస్. కుమార్, తదితరులు పాల్గొన్నారు.

జీలుగుమిల్లి :పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత అని ఎంపిడిఒ నిఖిల్ మధు శరణ్ అన్నారు. తాటియాకుల గూడెంలో పంచాయతీ సిబ్బందితో కలిసి పరిసరాలను పరిశుభ్రం చేశారు. మండలంలోని దర్భగూడెం, జీలుగుమిల్లి గ్రామాల్లో సర్పంచి సున్నం ఉషారాణి చిర్రి జగదాంబ ఆధ్వర్యంలో పరిసరాలను పరిశుభ్రం చేశారు. అనంతరం మొక్కలు నాటారు.

ముసునూరు : ప్రతిఒక్కరూ తమ ఇంటి పరిసర ప్రాంతంలో పరిశుభ్రత పాటించాలని ఎంపిడిఒ బసవరాజు అచ్యుత సత్యనారాయణ తెలిపారు. మండల కేంద్రమైన ముసునూరులో అవగాహనా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ మాట్లాడుతూ పంచాయతీ సిబ్బందికి సహకరిస్తూ ప్రతిఒక్కరూ తడి, పొడి చెత్తను వేర్వేరుగా పంచాయతీ సిబ్బందికి అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పంచా యతీ కార్యదర్శి డి.వెంకటేష్, తెలుగు యువత నియోజకవర్గ కార్యదర్శి కొండేటి బాబి, గ్రామ రెవెన్యూ అధికారి ఎన్.రంగా రావు, సీనియర్ అసిస్టెంట్స్ ఎస్.శ్రీనివాస్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఉంగుటూరు : నారాయణపురంలో మూడో శనివారం జరిగే స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమం సర్పంచి అలకనంద అధ్యక్షతన నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎంపిడిఒ, నారాయణపురం ప్రత్యేకాధికారి జిఆర్.మనోజ్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ మొక్కలు పెంచాలని తద్వారా పచ్చదనాన్ని పెంపొందించాలని గ్రామస్తులకు సూచించారు. అనంతరం నారాయణ పురం రెండో సచివాలయం ప్రాంగణంలో సర్పంచితో కలిసి ఆయన మొక్కలు నాటారు. గ్రామస్తులతో స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర ప్రతిజ్ఞ చేయించారు.

భీమడోలు :పర్యావరణ పరిరక్షణకు ప్రతిఒక్కరూ ఇంటికో మొక్క వంతున నాటాలని, దాని పరిరక్షణ బాధ్యత స్వీకరించాలని ఎంపిడిఒ పద్మావతి దేవి, తహశీల్దార్ బి.రమాదేవి కోరారు. గ్రామపంచాయతీ కార్యదర్శి తనూజ ఆధ్వర్యంలో శనివారం స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథులుగా హాజరైన ఎంపిడిఒ, తహశీల్దార్ పరిసరాల పరిశుభ్రత, చెత్త నుంచి సంపద తయారీ కేంద్రం సేవల వినియోగం ఇతర అంశాల గురించి వివరించారు. పంచాయతీ ఆవరణలో మొక్కలను నాటి ర్యాలీ నిర్వహించారు.

చింతలపూడి : ఎంపిడిఒ కార్యాలయ ప్రాంగణంలో మొక్కలు నాటి ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా ఎంపిపి రాంబాబు, ఎంపిడిఒ కామేశ్వరి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

నూజివీడు టౌన్ : మండల పరిధిలోని కొత్తూరు తండా గ్రామ పంచాయతీ పరిధిలోని లైన్ తండాలో కార్యక్రమం నిర్వహించారు. జెడ్‌పి సిఇఒ శ్రీహరి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు.

ముదినేపల్లి : పలు గ్రామాల్లో అధికారులు మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు. ముదినేపల్లి గ్రామ సచివాలయం వద్ద ఎంపిడిఒ వై.రామకృష్ణ మొక్కలు నాటారు. వడాలిలో టిడిపి నియోజకవర్గ కన్వీనర్ వీరమల్లు నరసింహారావు చెత్త నుంచి సంపద తయారీ కేంద్రం వద్ద మొక్కలు నాటారు.

విద్యార్థులకు జనరల్ నాలెడ్జ్ మెటీరియల్ పంపిణీ

ప్రజాశక్తి - ముసునూరు

మండలంలోని ముద్దాయికుంట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆరో తరగతి నుంచి తొమ్మిదో తరగతి చదువుతున్న విద్యార్థులకు పాఠశాల ప్రధానోపాధ్యాయులు, సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయులు దారపురెడ్డి భాస్కరరావు తయారు చేసిన జనరల్ నాలెడ్జ్ మెటీరియల్‌ను ఉచితంగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు దసరా సెలవులు వృధా కాకుండా రోజు విషయ పరిజ్ఞానాన్ని పెంచుకోవడానికి ఈ మెటీరియల్ దోహదపడుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆంగ్ల ఉపాధ్యాయులు బి.జాన్సన్, గణిత ఉపాధ్యాయులు పాగోలు నాగేంద్రరావు, జీవశాస్త్ర ఉపాధ్యాయులు కె.నవ్య, హిందీ ఉపాధ్యాయురాలు జె.పద్మ, తదితరులు పాల్గొన్నారు.